ఉక్కు దీక్షలకు సీపీఐ సంపూర్ణ మద్దతు

విశాలాంధ్ర - గాజువాక: ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా స్టీల్ ప్లాంట్ పరిరక్షణ పోరాట చేపట్టిన 36 గంటల దీక్షలకు సీపీఐ సంపూర్ణ మద్దతును ప్రకటించింది. 36 గంటల దీక్షల రెండవ రోజైన బుధవారం సిపిఐ నాయకులు పెదపూడి దుర్గారావు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావంను ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మాగారంను ప్రైవేట్ పరం చేయడం కోసం ప్రయత్నాలను ముమ్మరం చేసిందని అన్నారు. ఉక్కు ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి సిపిఐ మద్దతునిస్తున్నదని అన్నారు.

ఆర్థిక రాజధానిగా విశాఖ

ఒకేరోజు రూ.2,08,548 కోట్ల పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ఒక రికార్డ్
విశాఖ ప్రజావేదిక బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రపంచం మెచ్చిన నాయకుడని, మోదీ దేశానికే కాకుండా ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా గ్లోబల్ లీడర్‌గా ఉంటారని సీఎం చంద్రబాబు అన్నారు. భవిష్యత్తులో ప్రధాని మోదీ స్ఫూర్తితో ముందుకెళ్తామని ఉద్ఘాటించారు. రాష్ట్రంలో రూ.2,08,548 కోట్ల విలువైన పనులకు ప్రధాని మోదీతో కలిసి శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రజావేదిక బహిరంగ సభకు తరలివచ్చిన జనసందోహాన్ని ఉద్దేశించి సీఎం చంద్రబాబు ప్రసంగించారు. 'సభకు తరలొచ్చిన ప్రజానీకాన్ని చూస్తుంటే ఎక్కడా లేని ఆనందం కలుగుతోందన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ రోడ్ షో అదిరిందన్నారు. ప్రజల్లో విశ్వాసం, నమ్మకం ఉన్న నాయకుడు ప్రధాని మోదీ అని, ఈ రోజు మన రాష్ట్రం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ప్రధాని మోదీ చేతుల మీదుగా రాష్ట్రంలో రూ.2,08,548 కోట్ల విలువైన పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసుకున్నామన్నారు. ఇటువంటి శుభదినం నా జీవితంలో మొదటి సారి జరిగిందన్నారు. పూడిమడక వద్ద ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్‌లో రూ.1.85 లక్షల కోట్ల పెట్టుబడులు పెడుతోందన్నారు. విశాఖ వాసుల చిరకాల ఆకాంక్ష అయిన రైల్వే జోన్‌కు కూడా శంకుస్థాపన చేశామని, రైల్వే జోన్‌కు భూమి కేటాయించాలని కేంద్రం అడిగినా గత ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. అధికారంలోకి రాగానే 52 ఎకరాల భూమి ఇచ్చామని, నేడు ప్రధాని ఆశీస్సులతో జోన్ పనులు ప్రారంభం అయ్యాయన్నారు. నక్కపల్లిలో రూ.1877 కోట్లు పెట్టుబడులతో బల్క్ డ్రగ్ పార్క్, రూ.4,593 కోట్లతో 10 ప్రాజెక్టులకు సంబంధించి రోడ్డు నిర్మాణం, విస్తరణ పనులు, రూ.2,139 కోట్లతో కృష్ణపట్నం పారిశ్రామిక పార్క్, రూ.6,028 కోట్లతో 6 రైల్వే ప్రాజెక్టులు, రూ.3,044 కోట్లతో 234.28 కి.మీ రోడ్లు, రూ.5,718 కోట్లతో 323 కి.మీ మూడు రైల్వే లైన్ పనులకు శంకుస్థాన చేసుకున్నామని అన్నారు. మన ప్రభుత్వం వచ్చి 7 నెలలే అయిందని, మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టాక ఏపీకి మోదీ మొదటి సారి వచ్చి రూ.2,08,548 కోట్ల పనులకు శంకుస్థాన, ప్రారంభోత్సవాలు చేయడంపై ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. అనునిత్యం అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూ అసాధ్యాన్ని సుసాధ్యం చేసి ప్రజలకు ప్రధాని మోదీ దగ్గరయ్యారన్నారు. మోదీపై అభిమానం ఉత్తరాదికి పరిమితం అంటున్నారని, కానీ మోదీ.. దేశం, ప్రపంచం మెచ్చే నాయకుడు అన్నారు. మొన్నటి ఎన్నికల్లో నరేంద్రమోదీ, నా మిత్రుడు పవన్ కళ్యాణ్, నేను కలిసి పోటీ చేశామని, రాష్ట్ర చరిత్రలో లేని విజయాన్ని ప్రజలు మాకు ఇచ్చారన్నారు. 93 శాతం

స్ట్రైక్ రేట్, 57 శాతం ఓట్లు వేసి 164 అసెంబ్లీ సీట్లు, 21 ఎంపీ స్థానాల్లో విజయం కట్టబెట్టారన్నారు. భవిష్యత్తులోనూ ఏపీలో ఇదే కాంబినేషన్ కొనసాగు తుందని, ప్రధానిగా మోదీ ఉంటారన్నారు. హర్యానా, మహారాష్ట్రలో మోదీ నాయకత్వంలో ఎన్డీయే ఘన విజయం సాధించిందంటే అదీ మోదీ చరిష్మా అని, రాసిపెట్టుకోండి ఢిల్లీలో గెలిచేది కూడా ఎన్డీయేనేనన్నారు. విభజన సమయంలో ఏపీకి న్యాయం చేయాలని కోరారు. ప్రధానిగా బాధ్యతలు చేపట్టాక ఏపీ జీవనాడి అయిన పోలవరం పనులు ఆగకుండా జరగడం కోసం 7 ముంపు మండలాలను ఏపీలో విలీనం చేస్తూ నాడు తొలి కేబినెట్ సమావేశంలోనే ఆమోదించారన్నారు. విభజన హామీల్లో భాగంగా ఐఐటీ, ఐఐఎం, నిట్, ఎయిమ్స్, ట్రైబల్ యూనివర్సిటీ, సెంట్రల్ వర్సిటీ వంటి దాదాపు 12 సంస్థలను రాష్ట్రానికి కేటాయించారని, మళ్ళీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి కేంద్రం ఆక్సిజన్ ఇచ్చిందన్నారు. రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వంలో పెంచిన పింఛన్లు, అన్న క్యాంటీన్లు, దీపం కింద ఆడబిడ్డలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నామని, త్వరలోనే మెగా డీఎస్సీ నిర్వహిస్తామన్నారు. ఎన్నికల ముందు చెప్పిన విధంగా సూపర్-6 హామీలను అమలు చేసే బాధ్యత ఎన్డీయే ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. కష్టాలు, సమస్యలు ఉన్నాయని అధిగమిస్తామని, ఒకవైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమాన్ని అందిస్తూ రాష్ట్రాన్ని సుపరిపాలనలో ముందుకు తీసుకెళ్తామన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు ఊపందుకున్నాయన్నారు. రాష్ట్ర బ్రాండ్‌ను పెంచుకుంటున్నామని, దేశానికి ముంబై ఏ విధంగా ఆర్థిక రాజధానిగా ఉందో, మన రాష్ట్రానికి విశాఖ కూడా ఆర్థిక రాజధాని అని, ఐటీ, ఫార్మా, పర్యాటక రంగాలు పురోగతిలో ఉన్నాయన్నారు. ప్రధాని మోదీ అరకు కాఫీని ప్రమోట్ చేయడంతో ప్రపంచం మొత్తం మోస్ట్ బ్రాండ్‌గా తయారైందని తెలిపారు. ఈ సభలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తో పాటు కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, శ్రీనివాస్ వర్మ, బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందరేశ్వరి, ఎంపీలు శ్రీ భరత్, సీఎం రమేష్, మంత్రులు , ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

మోడీ పర్యటనకు వ్యతిరేకంగా వామపక్షాల నిరసన

విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై ప్రకటన చేయాలని నినాదాలు
సిపిఐ, సిపిఎం, ఏపీ ఎఫ్‌టియు కార్యకర్తలు అరెస్టు

విశాలాంధ్ర - విశాఖ: ప్రధాని నరేంద్ర మోడీ విశాఖ పర్యటనకు నిరసనగా సిపిఐ సిపిఎం ఏపీ ఎఫ్‌టియులకు చెందిన కార్యకర్తలు మద్దిలపాలెం జంక్షన్‌లో పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నిరసన కారులపై వందలాదిమంది పోలీసులు పాశవిక దాడి చేసి, అక్రమంగా అరెస్టు చేసి ఎంవీపీ, ఆరిలోవ తదితర పోలీస్ స్టేషన్ లలో నిర్బంధించారు. మంగళవారం రాత్రి నుండే విశాఖ, అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా సిపిఐ, సీపీఎం నాయకులను గృహ నిర్బంధం, పోలీస్ స్టేషన్లలో పెట్టడం చేసారు. ఈ సందర్భంగా సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగా రావు, ఏపీ ఎఫ్ టి యు దేవ మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మోడీకి దాసోహమై విశాఖ స్టీల్ ప్లాంట్‌కు తీవ్ర ద్రోహం తలపెట్టిందని విమర్శించారు. మిట్టల్‌కు దొడ్డి దారిన

విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కట్టబెట్టాలని కుట్ర చేస్తున్నారని, వెంటనే ఈ దుర్మార్గాన్ని ఆపకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలని, స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, క్యాపిటల్ రిస్ట్రక్చరింగ్ కోసం 20 వేల కోట్ల రూపాయలు కేటాయించాలని డిమాండ్ చేశారు.

మధురవాడలో హౌస్ అరెస్టులు

విశాలాంధ్ర - మధురవాడ: భారత ప్రధాని నరేంద్ర మోడీ విశాఖ పర్యటన సందర్భంగా బుధవారం మధురవాడ వామపక్ష పార్టీ నాయకులను పీయం పాలెం పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చెయ్యమని ప్రకటించాలని ప్రధాని నరేంద్ర మోడీకి విన్నపిస్తూ వామపక్ష పార్టీలు నిరసన కార్యక్రమం చేపట్టాలని పిలుపునివ్వడంతో మధురవాడ ఏరియా సిఐటియు ప్రధాన కార్యదర్శి పి.రాజ్ కుమార్, మధురవాడ ఏరియా సిపిఐ కార్యదర్శి వాండ్రాశి సత్యనారాయణను అరెస్ట్ చేసి పియం పాలెం పోలీసు స్టేషన్‌కు తరలించారు.

మోడీ సభకు తరలిన నేతలు

విశాలాంధ్ర - మల్కాపురం: భారత ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విశాఖపట్నం పర్యటన సందర్భంగా పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పి.జి.వి.ఆర్.నాయుడు ఆదేశాలు మేరకు బుధవారం పారిశ్రామిక ప్రాంతం పరిధి 61వ వార్డ్ మల్కాపురం మరిడిమాంబ ఆలయం వద్ద నుండి ఆ వార్డు టిడిపి అధ్యక్షులు మజ్జి సోమేష్ ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో నేతలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి బహిరంగ సభకు వెళ్లారు.

గోపాలపట్నం: గ్రేటర్ విశాఖలో సుమారు రెండు లక్షల కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చిన భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సభకు కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో భారీగా ప్రజలు తరలివెళ్లారు. విశాఖపట్నం తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ ఉపాధ్యక్షులు నందవరపు సోములు ఆధ్వర్యంలో 92వ వార్డు, వెంకటాపురం పరిసర గ్రామాలలో సుమారు 20 బస్సుల్లో ప్రజలను తరలించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్యదర్శి కంపర ఆనంద్, ఈ.తాతబాబు, సాలాపు పైడిరాజు, నూనెల రామారావు, అండి బోయిన శ్రీనివాస్, జి.వెంకట్రావు, అమర పిన్ని నాగమణి, కూసి స్వప్న పాల్గొన్నారు.

పెదగంట్యాడ: ప్రధాని మోడీ బహిరంగ సభకు 75వ వార్డు నుండి కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో బయలుదేరి వెళ్లారు. 75వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ పులి లక్ష్మిబాయి వెంకట రమణా రెడ్డి ఇతర కూటమి నాయకులు జెండా ఊపి ఈ ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి, వార్డు టీడీపీ అధ్యక్ష కార్యదర్శులు నమ్మి అప్పారావు, దోమ్మేటి పెరుమాళ్, జనసేన నాయకులు కోన చిన అప్పారావు, జ్యోతి రెడ్డి, బీజేపీ నాయకులు కిలాన ముసలయ్య, లక్ష్మి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

మోడీ సభకు నిరసనల భయం....

అడుగడుగునా విశాఖలో అరెస్టులు, గృహ నిర్బంధాలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విశాఖపట్నం పర్యటన సందర్భంగా వామ పక్ష పార్టీల నేతలను, కార్యకర్తలను, కార్మిక సంఘాల నేతలను అడుగడుగునా గృహ నిర్బంధం చేసి, అరెస్టులు చేసి వివిధ పోలీస్ స్టేషన్‌లకు తరలించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేట్ ప్రధాని మోదీ ప్రకటన చేయాలని కోరుతూ బుధవారం ఉదయం నుండి విశాఖలో నిరసనల పర్వం జోరందుకుంది. అనేకమంది నేతలను, కార్యకర్తలను రాత్రి 8 గంటల వరకు గృహ నిర్బంధాలు చేశారు. మరికొన్నిచోట్ల నిరసన ఆందోళనల చేస్తున్న వారిని అరెస్ట్ చేసి వివిధ పోలీస్ స్టేషన్‌లకు తరలించారు.

సభకు పెన్ను, కాగితాలు నిషేధం

సభకు వచ్చే ప్రజలు ఎవరు పెన్నులు, పుస్తకాలు, చివరకు తెల్ల కాగితాలు తీసుకుని రాకుండా పోలీసులు అడుగు అడుగడుగునా తనిఖీలు చేశారు. అనేక మంది విద్యావంతులు పెన్నులు జేబులో పెట్టుకోవడం వారి హుందాతనంగా భావించారు. సభలో నిరసనలు భయంతో తెల్ల కాగితాల్లో తమ సమస్యలు పరిష్కరిం చాలని ఎక్కడ ప్రశ్నిస్తారని, సభకు వచ్చే వారందరి జేబుల్లో పెన్నులు, కాగితాలు అను మతించలేదని పోలీసులు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

ఐఎన్ఎస్ డేగలో ప్రధాని మోదీకి ఆత్మీయ స్వాగతం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ఐఎన్ఎస్ డేగలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్‌లు ఆత్మీయ స్వాగతం పలికారు. వివిధ అభివృద్ధి ప్రాజెక్టులను జాతికి అంకితం చేసే ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విశాఖపట్నం ఐఎన్ఎస్ డేగాకు బుధవారం సాయంత్రం చేరుకున్నారు. ఈ క్రమంలో ప్రధానికి రాష్ట్రానికి చెందిన రాజకీయ, అధికార ప్రముఖులు స్వాగతం పలికారు. రాష్ట్ర గవర్నర్, రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులతో పాటు పార్లమెంటు సభ్యులు, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు డి.పురంధేశ్వరి, ఈస్టర్న్ నేవల్ కమాండర్ వైస్ అడ్మిరల్ పెందార్కర్, రాష్ట్ర శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు, రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు, ఆర్.కృష్ణయ్య, ప్రభుత్వ విప్ పి.జి.వి.ఆర్.నాయుడు (గణబాబు), శాసన సభ్యులు సిహెచ్ ఆదినారాయణ రెడ్డి, ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్, ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణ మూర్తి, అతిది గజపతి రాజు, కోండ్రు మురళీ మోహన్, కొణతాల రామకృష్ణ, కామినేని శ్రీనివాసరావు, శాసన మండలి సభ్యులు దువ్వారపు రామారావు, శాసన మండలి సభ్యులు, విప్ వేపాడ చిరంజీవిరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

పారిశుధ్యంపై మరింత శ్రద్ధవహించాలి

ఎంపీపీ రాంబాబు

విశాలాంధ్ర - పద్మనాభం: మండలంలోని ప్రతి పంచాయతీలో పారిశుధ్యంపై మరింత శ్రద్ధ పెట్టాలని ఎంపీపీ కె.రాంబాబు తెలిపారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. కొత్త వైరస్‌లు, వ్యాధులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అసంపూర్తిగా నిలిచిపోయిన పనులు పూర్తి చేయడానికి ప్రతి పంచాయతీకి పనులు పూర్తి చేయడం నిమిత్తం మండల పరిషత్ నిధుల నుంచి సుమారు మూడు లక్షల రూపాయలు చొప్పున విడుదల చేస్తున్నట్లు తెలియజేశారు. వివిధ శాఖలకు సంబంధించి జరుగుతున్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యశాఖ అధికారులు మాట్లాడుతూ అకాల వర్షాలు కారణంగా నీరు నిల్వ ఉన్న వివిధ ప్రదేశాలలో వెంటనే నిల్వ వున్న నీరును తొలగించడం ద్వారా దోమల బారిన పడకుండా తద్వారా వచ్చే రోగాల బారిన పడకుండా నివారించవచ్చునని తెలియజేశారు. ఈ సమావేశంలో పలు శాఖలకు సంబంధించిన మండల అధికారులు, ఈవోపిఆర్‌డి, ఎస్ఓ, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాల్ని ఆపలేరు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విశాఖ నగర పర్యటన సందర్భంగా జరుగుతున్న సభలో రాష్ట్ర ప్రజల జీవనాడి అయిన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయుబోమని ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ, సీఐటీయూ ఇతర కార్మిక సంఘాలు నిరసనలు తెలియజేసాయి. మద్దిలపాలెం ప్రాంతంలో నిరసనలకు సిద్ధమవుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణతోపాటు కార్యకర్తలను బలవంతంగా పోలీసులు అరెస్టు చేసి ఎంవిపి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అలాగే ఎంఎంటిసి కాలనీలో ఉన్న సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పడాల గోవిందను, ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సభ్యులు అద్దూరి శంకర్రావును ముందస్తుగా అరెస్టు చేసి ఎంవిపి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ మీడియాతో మాట్లాడుతూ మూడోసారి ఉత్తరాంధ్రకి నరేంద్ర మోడీ ప్రభుత్వం ఏమి అభివృద్ధి చేశారని, రోడ్ షోలు, బహిరంగ సభలు పెడుతున్నారని ప్రశ్నించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కుట్ర పూర్వకంగా నష్టాలు చూపించి ప్రైవేటు వ్యక్తులకు దారాదత్తం చేస్తున్నందుకే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. అరెస్టు అయిన వారిలో అద్దూరి శంకర్రావు, కే.ఈశ్వర రావు, కె.శివ విల్లా రమణ, సిహెచ్ సూరిబాబు, కొండబాబు, ఎం.శివ తదితరులు ఉన్నారు.

స్టీల్ ప్లాంట్‌ను రక్షించమంటే అరెస్టు చేస్తారా..?

యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి షఫీ

విశాలాంధ్ర - పెందుర్తి: గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటుపరం కాకుండా కాపాడాలని కోరిన కాంగ్రెస్ నాయకులను అడ్డగోలుగా అరెస్టు చేయడం దారుణమని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ షఫీ ఉల్లా విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోడీ విశాఖపట్నం పర్యటన సందర్భంగా నగరంలో కాంగ్రెస్ శ్రేణులు భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టగా పోలీసులను వారి అరెస్టు చేశారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన షఫీ మీడియాతో మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్‌ను రక్షించాలని కోరుతూ కాంగ్రెస్ శ్రేణులు నగరంలో నిరసన కార్యక్రమాలు చేపట్టాయని, ఏపీ ప్రజల ఆవేదనను ప్రధాని దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకొని అన్యాయంగా అరెస్టు చేశారని విమర్శించారు. స్టీల్ ప్లాంట్ రక్షణ కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని సఫీ స్పష్టం చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కు సొంత గనులు కేటాయించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని, మౌలిక వసతులు కల్పనకు నిధులు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి, రాహుల్ గాంధీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టాక విశాఖ స్టీల్ ప్లాంట్‌కు మంచి రోజులు వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

తొలి అమరుడు దొడ్డి కొమరయ్య : చిత్ర దర్శకుడు సేనాపతి

విశాలాంధ్ర - గాజువాక : తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య చిత్ర యూనిట్ బుధవారం కూర్మన్నపాలెం లయన్స్ క్లబ్ అధ్యక్షునితో భేటీ అయ్యింది. కూర్మన్న పాలెం లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఏ. మురళీ ధర్ రెడ్డితో దొడ్డి కొమరయ్య చిత్ర యూనిట్ మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కతో అభినందించింది. ఈ సందర్భంగా దొడ్డి కొమరయ్య చిత్ర దర్శకులు ఎం.సేనాపతి మాట్లాడుతూ వెట్టి చాకిరికి వ్యతిరేకంగా, భూస్వాముల ఆగడాలకు ఎదురొడ్డి పోరాడి అమరుడైన దొడ్డి కొమరయ్య చిత్రాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ చిత్రం కొద్ది రోజుల్లో నిర్మాణం పూర్తి చేసుకోనుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో దొడ్డి కొమరయ్య చిత్ర యూనిట్ సభ్యులు ఎస్.కె.అబ్దుల్ రెహమాన్, తక్కళ్ళ పల్లి విజయ కుమార్, రావుల శ్రీనివాస్, నాగ రాజు, మద్ది అప్పల రెడ్డి, ఉక్కు తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి జి.ఆనంద్, ప్రతినిధులు బి.వెంకటేశ్వర్లు, ఎస్.బలరాం, వి.సహదేవ్ పాల్గొన్నారు.

నిత్యాన్నప్రసాద పథకానికి లక్ష విరాళం

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారి నిత్యాన్న ప్రసాదానికి హైదారాబాద్‌కు చెందిన మణి గాయత్రి కుటుంబసభ్యులు రూ.1,00,000/-లు విరాళంగా ఇచ్చారు. వీరికి ఏఇఓ రాంబాబు, ప్రోటోకాల్ సూపరిం టెండెంట్ విక్రమ్ అన్న ప్రసాద బాండును అందజేశారు. తదుపరి దాతకు దర్శనం అనంతరం వేద ఆశీర్వచనం చేయించి, శేష వస్త్రంతో సత్కరించి పర్యవేక్షణ అధికారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఏకాదశి సందర్భంగా స్వర్ణ తులసి దళార్చన వైభవంగా జరిగింది.

రూ.10 లక్షలతో అభివృద్ధి పనులు

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలంలోని తర్లువాడ గ్రామపంచాయతీలో 10 లక్షల రూపాయలు మండల పరిషత్ నిధులతో గ్రామంలో సిమెంట్ రోడ్లుకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ అభివృద్ధికి గ్రామ ప్రజలందరూ పార్టీలకతీతంగా కట్టుబడి ఉన్నారని సర్పంచ్ తెలిపారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ బిఆర్‌బి నాయుడు, మాజీ సర్పంచ్ మజ్జి వెంకట్రావు, తాత్రాజు అప్పారావు, బంకు రాజు, రమేష్ నాయుడు తదితర నాయకులు పాల్గొన్నారు.

ఐదేళ్ల చీకటి పాలన నుంచి విముక్తి
వెలుగు వైపు అడుగులు వేస్తున్నాం...

రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: 'అభివృద్ధికి ఆస్కారమే లేని ఆంధ్రప్రదేశ్ నుంచి.. అభివృద్ధి పుష్కలమైన ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడానికి మేమంతా కష్టపడి పని చేస్తున్నామని గత ఐదేళ్ల చీకటి రోజుల నుంచి, అరాచక పాలన నుంచి మళ్లీ వెలుగు రేఖలు రాష్ట్రంలో పూయించడానికి అడుగులు వేస్తున్నామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. బుధవారం విశాఖపట్నం వేదికగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రవ్యాప్తంగా రూ. 2.08 లక్షల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. పూర్తయిన పలు జాతీయ రహదారులు, ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రా యూనివర్శిటీ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో అశేష జనవాహినిని ఉద్దేశించి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ రాష్ట్రానికి ఒకేసారి రూ. 2.10 లక్షల కోట్ల పెట్టుబడులు, సుమారు ఏడున్నర లక్షల మందికి ఉపాధి కల్పించే మార్గాలను ప్రధాని నరేంద్ర మోడీ సహకారంతో తీసుకువచ్చామన్నారు. ఈ నిరంతర అభివృద్ధి యజ్ఞం కొనసాగాలని, ఎన్డీఏ కూటమిపై ప్రజలంతా ఉంచిన నమ్మకాన్ని నిలుపుకొంటూ వారికి మరింత అండగా నిలుస్తామని స్పష్టం చేశారు. గత ఐదేళ్ల అరాచక, అభివృద్ధిరహిత పాలన నుంచి ఆంధ్రప్రదేశ్ మళ్లీ కొత్తగా తన ప్రయాణాన్ని అభివృద్ధి పథంలో మొదలుపెట్టబోతుందని చెప్పారు. "సదుద్దేశం.. సదాశయం లేకుండా ఒకరు కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు నడిచినా అది నిరర్థక నడకగా చరిత్రలో మిగిలిపోతుందన్నారు. ఒక సదాశయం.. సత్సంకల్పంతో ఇంకొకకరు కన్యాకుమారి నుంచి కశ్మీరు వరకు ప్రజలతో మమేకమై వారందర్నీ ఏకతాటిపై నడిపిస్తే అది ఆత్మ నిర్భర్ భారత్ అవుతుంది. అదే కన్యాకుమారి నుంచి కశ్మీరు వరకు ప్రజలకు వారి పరిసరాల శుభ్రత, బాధ్యత తెలియజేస్తే అది స్వచ్ఛ భారత్ అవుతుందన్నారు. అదే కన్యాకుమారి నుంచి కశ్మీరు వరకు ప్రజల గుండెల్లో దేశభక్తి, ధైర్యసాహసాలు నింపితే అది పటిష్టమైన, బలిష్టమైన భారత్ అవుతుందన్నారు. అది ఒక రోజున అఖండ భారత్ గా వర్ధిల్లుతుందన్నారు. ఒక బలమైన భారత్ కోసం, ధృడమైన దేశం కోసం, జగత్ అంతా వసుధైక కుటుంబం అనే భావన కోసం నాలుగున్నర దశాబ్దాలుగా పరితపిస్తూ, పరిశ్రమిస్తూ.. ఆ క్రమంలో ఎదురైన ప్రతి పరాజయాన్ని, ప్రతి అవమానాన్ని నవ్వుతూ స్వీకరిస్తూ.. వాటినే విజయానికి ఇంధనంగా వాడుకుంటూ.. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ.. భారత దేశాన్ని ప్రపంచంలోనే మూడవ బలమైన ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేలా నడిపిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి నా తరఫున, ఐదు కోట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజల తరఫున నమస్కారాలు అన్నారు. ఐదేళ్ల అవినీతి, అరాచక పాలనతో ఆంధ్రప్రదేశ్ అంధకారంలో కూరుకుపోయిన సమయంలో ఎన్డీఏ కూటమితో ముందుకు వచ్చి రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు తీర్చేందుకు మోదీ ఆశాజ్యోతిగా నిలిచారన్నారు. ఆంధ్ర ప్రదేశ్ అభివృద్ధికి అస్కారమే లేదు అనే పరిస్థితి నుంచి అభివృద్ధి అంటే ఆంధ్ర ప్రదేశ్ అని చెప్పుకొనేలా చంద్రబాబునాయుడు నాయకత్వంలో, ప్రధాన మంత్రి నిర్దేశకత్వంలో ముందుకు వెళ్తున్నామన్నారు. వారి సూచనలు, సలహాలతో రాష్ట్ర అభివృద్ధికి రేయింబవళ్లు కష్టపడతామన్నారు. దేశ ప్రగతిలో భాగస్వాముల వుతామన్నారు.

యంగ్ ఇండియాను సద్వినియోగం చేసుకోవాలి

యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి మమత నాగి రెడ్డి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: యంగ్ ఇండియా కే బోల్ కార్యక్రమాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి మమత నాగి రెడ్డి కోరారు. విశాఖ ఎల్లమ్మ తోట లో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆంధ్ర ప్రదేశ్ యువజనులు అందరూ ఈ కార్యక్రమం జయప్రదం చేయాలన్నారు. ఈ వెబ్ సైట్‌కి యువజనులు వీడియోలు పంపాలి అని కోరారు. పోటీల అనంతరం విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. దేశంలో యువతకు సత్యం, న్యాయం, సమానత్వం కోసం పోరాడుతున్నామన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కేంద్ర ప్రభుత్వం యువతకు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇవ్వాలి అని డిమాండ్ చేశారు. దేశంలో బిజేపి కూటమి ప్రభుత్వం గత పదేళ్లలో 20 కోట్ల ఉద్యోగాలు ఇవ్వలేదు అని గుర్తు చేశారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అడ్డాల వెంకట వర్మ రాజు మాట్లాడుతూ, యంగ్ ఇండియా సీజన్ 5లో భాగంగా పోటీలు యువజనులకు నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి ప్రతిభను చూపడానికి ఉపయోగ పడుతుంది అన్నారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు లక్క రాజు రామారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సతీష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నాయకుల అరెస్ట్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ప్రధాని మోదీ విశాఖ పర్యటన సందర్భంగా స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ ఇంచార్జ్ ప్రియాంక దండి ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ నాయకులతో మద్దిలపాలెం జంక్షన్ ఆంధ్ర యూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్ద ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా పోలీస్‌లు వారిని అరెస్ట్ చేసి ఎంవిపి పోలీస్ స్టేషన్‌కి తరలించారు. అరెస్ట్ అయిన వారిలో జాతీయ యూత్ కాంగ్రెస్ సెక్రటరీ, ఆంధ్రప్రదేశ్ యూత్ కాంగ్రెస్ ఇంచార్జ్ మమతా నాగిరెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు లక్కరాజు రామారావు, రాష్ట్ర కార్యదర్శి చినిబిల్లి శివ కుమార్, విశాఖ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అల్లిపిల్లి సతీష్ కుమార్, తదితరులు వున్నారు.

మోడీ సభకు విశేష స్పందన..

ఆనందపురం మండలం నుండి సుమారు 3 వేలు మందికి పైగా హాజరు

విశాలాంధ్ర - ఆనందపురం: భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బుధవారం విశాఖ విచ్చేసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు రోడ్ షో, వర్చువల్ శంకుస్థాపన, సమావేశం నిర్వహించే కార్యక్రమం నేపథ్యంలో ఆనందపురం మండలంలోని 26 గ్రామపంచాయతీలు నుంచి ఎన్డీఏ తెలుగుదేశం, జనసేన, బిజెపి ,నాయకులు కార్యకర్తలు బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. సుమారు 3వేలు మందికి పైగా నాయకులు హాజరవుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా మండల కూటమి నాయకులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సుమారు 2 లక్షల 8 వేల కోట్లు తో పలు అభివృద్ధి కార్యక్రమాలకు భారత దేశ ప్రధానమంత్రి మోడీ శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉందని ఉమ్మడి కూటమి ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పెట్టుబడులతో అలాగే యువతకు ఉపాధి కల్పించడంలో అగ్రస్థానానికి వెళుతుందని ఈ సందర్భంగా ప్రతి ఒక్కరు రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడాలని మండల నాయకులు తెలిపారు.

డివిడెండ్ల పంపిణీ

విశాలాంధ్ర - సింహాచలం: గ్రేటర్ విశాఖ 98వ వార్డులో ఉన్న అడవివరం కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ యొక్క షేరు ధనముపై వడ్డీ 20%, త్రిఫ్ట్ డిపాజిట్‌పై వడ్డీ 8%, సొసైటీ క్యాలెండర్స్‌ను సంఘ సభ్యులకు అందజేశారు. సొసైటీ అధ్యక్షులు కర్రీ అప్పలస్వామి(స్వామి) ఈ సందర్భంగా మాట్లాడుతూ సంఘ సభ్యులు కేవైసీని అప్‌డేట్ చేసుకోవాలన్నారు. తీసుకున్న రుణములు సకాలంలో చెల్లించి సొసైటీ అభివృద్ధికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అడవివరం సహకార పరపతి సంఘ ఉపాధ్యక్షులు బంటుబిల్లి మహేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు బోర ప్రసాద్ రెడ్డి, మజ్జి ధర్మరాజు, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

యూనిటీమాల్‌తో చేనేతకు ఊతం

రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: యూనిటీమాల్ నిర్మాణంతో చేనేత, హస్త కళల ఉత్పత్తులకు మార్కెట్ సదుపాయం కల్పించడంతో పాటు చేనేత కళాకారులకు ఆర్థిక భరోసా లభించనుందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖామంత్రి ఎస్.సవిత తెలిపారు. బుధవారం ఆమె విశాఖపట్నంలో రామానాయుడు స్టూడియో పక్కన ఉన్న యూనిటీమాల్ కు కేటాయించిన స్థలాన్ని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణితో మంత్రి పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూ.172 కోట్లతో చేపడుతున్న యూనిటీమాల్ నిర్మాణ ప్లాన్ గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. నాలుగు అంతస్తుల్లో చేపడుతున్న యూనిటీమాల్ ను భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా నిర్మించాలని ఆదేశించారు. చేనేత, హస్తకళల ఉత్పత్తులు విక్రయాలు పెరిగేలా షాపులు నిర్మాణం చేపట్టాలన్నారు. చేనేత, హస్త కళల ఉత్పత్తిదారులకు ఆర్థిక భరోసా కల్పించడానికి చర్యలు తీసుకోవాలన్నారు.

వ్యాపారం, వినోదం:

యూనిటీమాల్ ను అటు వ్యాపారులకు, ఇటు వినోదానికి ప్రాధాన్య ఉండేలా నిర్మించనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. జీ ప్లస్ 4 పద్ధతితో నిర్మిస్తున్న ఈ భవనంలో మొదటి రెండు అంతస్తుల్లో 62 షాపులు ఏర్పాటు చేయనున్నామని, మూడో అంతస్తులు సముద్రాన్ని వీక్షించేలా సీ వ్యూతో పాటు రెస్టారెంట్లు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. నాలుగో అంతస్తులో కన్వెన్షన్ హాలుతో పాటు రెండు మినీ థియేటర్లు, రిటైల్ స్టోర్లు, రెస్టారెంట్లు వంటి సదుపాయాలు కల్పించనున్నట్లు మంత్రి తెలిపారు. ఒకే భవనంలో వ్యాపారాలు, వినోదం లభించేలా ఈ నిర్మాణం చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు. రుషికొండ బీచ్, రామానాయుడు స్టూడియో వంటి పర్యాటక ప్రదేశాలకు పర్యాటకులను ఆకట్టుకునేలా యూనిటీమాల్ నిర్మించనున్నామన్నారు.

అమ్మకాలు పెంచండి

అనంతరం నగరంలోని రామ్ నగర్‌లో ఉన్న మోడ్రనైజ్డ్ లేపాక్షి షోరూమ్ ను, సిరిపురంలో ఉన్న ఆప్కో షోరూమ్‌ను మంత్రి సవిత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా షాపుల్లో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాలను, హస్త కళారూపాలను పరిశీలించారు. ఏయే వస్త్రాలు ఎంతమేర విక్రయిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. రోజువారి అమ్మకాల వివరాలను ఆరా తీశారు. రాబోయే సంక్రాంతిని దృష్టిలో పెట్టుకుని చేనేత వస్త్రాల విక్రయాలు పెరిగేలా ప్రచారానికి పెద్దపీట వేయాలన్నారు. చేనేత వస్త్రాలపై ఇస్తున్న రాయితీపై పెద్ద ఎత్తున ప్రచారం చేయాలన్నారు. ప్రభుత్వ నిర్దేశించిన లక్ష్యాల మేరకు అమ్మకాలు సాగించాలని మంత్రి సవిత స్పష్టంచేశారు.

మంత్రులు అనిత, సంధ్యారాణితో భేటీ

విశాఖ పర్యటనకు వచ్చిన మంత్రి సవిత...మంత్రులు అనిత, గుమ్మడి సంధ్యారాణి మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర హోం మంత్రి అనిత నివాసంలో వారిద్దరినీ కలిశారు. ఈ సందర్భంగా ముగ్గురు మంత్రులు ప్రస్తుతం రాష్ట్రం నెలకొన్న రాజకీయాంశాలపై చర్చించుకున్నారు.

ప్రధాని మోడీ సభలో పాల్గొన్న మంత్రి సవిత

ఏయూ మైదానంలో వర్చువల్ విధానంలో విశాఖ రైల్వే జోన్ ప్రధాన కార్యాలయ భవన నిర్మాణంతో పాటు పలు అభివృద్ధి పనులు ప్రారంభం, శంకుస్థాపనతో పాటు అంకితం చేసే కార్యక్రమంలో ప్రధాని నరేంద్రమోడి, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రాష్ట్ర మంత్రులతో పాటు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పాల్గొన్నారు. ప్రధాని నరేంద్రమోడికి, సీఎం చంద్రబాబుకు మంత్రులతో కలిసి ఆమె ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎమ్మెల్యేలు, పలు శాఖల అధికారులు టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'ఇండస్‌ఫుడ్ 2025'లో తెనాలి డబుల్ హార్స్ గ్రూప్

విశాలాంధ్ర- విశాఖపట్నం: ఢిల్లీ ఇండియా ఎక్స్‌పోజిషన్ మార్ట్‌లో జరిగిన 'ఇండస్‌ఫుడ్ 2025'లో ప్రీమియం వంట సామాగ్రి ఉత్పత్తుల్లో అగ్రగామి తెనాలి డబుల్ హార్స్ గ్రూప్ పాల్గొంది. బుధవారం ప్రారంభమైన ఈ ఎక్స్‌పో . ఈనెల 10వ తేదీ వరకు జరగనుంది. ఈ ఎక్స్‌పోలో 20 దేశాల నుంచి ఆహార ప్రాసెసింగ్ సంస్థలు, 1,800 పైగా ప్రదర్శకులు, 5,000 పైగా అంతర్జాతీయ కొనుగోలుదారులు పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా తెనాలి డబుల్ హార్స్ గ్రూప్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ మోహన్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణ ఆహార పదార్థాలను ప్రపంచానికి పరిచయం చేయడంలో ఈ వేదిక కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఇండస్‌ఫుడ్ మన గ్రామీణ ఆహార సంస్కృతి గొప్పతనాన్ని, సంప్రదాయాలను ముందుకు తీసుకువెళ్ళే అవకాశాన్ని అందిస్తుందని చెప్పారు. ఇది మన గ్రామీణ వైద్యాన్ని గ్లోబల్ మార్కెట్లకు తీసుకువెళ్ళే ప్రస్థానంలో ఒక మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు.

అధ్యక్షుడ్ని మార్చనున్న బిజెపి అధిష్ఠానం

రవీంద్రపై తీవ్ర అసంతృప్తి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జాతీయస్థాయిలో అతిపెద్ద పార్టీగా అవతరించిన భారతీయ జనతా పార్టీ (బిజెపి) కేంద్రంలో మూడుసార్లు అధికారంలోకి వచ్చినప్పటికీ రాష్ట్రంలో దాని ప్రభావం పెద్దగా కనిపించలేదు. విశాఖపట్నంపై అసలు లేదు. గత జీవీఎంసీ కార్పొరేటర్ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి ఒక్కరే గెలిచారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి నుంచి కూటమితో పొత్తు వల్ల ఒక ఎమ్మెల్యే గెలిపొందారు. ఈ నేపథ్యంలో విశాఖ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న మేకపాటి రవీంద్ర పార్టీని సమర్థవంతంగా ముందుకు నడిపించడంలో పూర్తిగా విఫలమయ్యారని పార్టీ వర్గాలు అసత్రుప్తి వ్యక్తం చేస్తున్నాయి. గతంలో అధ్యక్షులుగా పనిచేసిన బండారు రంగ మోహన్‌రావు, పీవి నారాయణరావు, పృథ్వి రాజ్, నాగేంద్ర పార్టీపై తమ మార్కు చూపించారు. ప్రజల మధ్య ఉంటూ ఏదో ఒక కార్యక్రమం నిర్వహించేవారు. ప్రస్తుతం అధ్యక్షుడిగా ఉన్న రవీంద్ర పార్టీ తరఫున ఒక్క కార్యక్రమం కూడా నిర్వహించిన దాఖలాలు లేవనేది కార్యకర్తల మాట. రాష్ట్ర అధ్యక్షులు లేదా జాతీయ స్థాయి నాయకులు వచ్చినప్పుడు వారితోపాటు పాల్గోవడమేగాని స్వచ్ఛందంగా పత్రికా ప్రకటన కూడా విడుదల చేసిన పాపాన పోలేదని పార్టీ కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. విలేకరుల సమావేశంలో నాయకుల పక్కన కూర్చోవడమే తప్ప మరో కార్యక్రమం లేదు. కేంద్రంలో అధికారంలో వున్న పార్టీ తరఫున కార్యక్రమాలు నిర్వహించడంలో వైఫల్యం స్పష్టంగా కనిపిస్తుంది. ప్రభుత్వ పథకాలు ప్రచారం చేయడం, ప్రజలు వద్దకు తీసుకువెళ్ళడం చేయలేకపోయారని, రాష్ట్రంలో జరుగుతున్న ప్రజా వ్యతిరేక విధానాలపై మాట్లాడలేకపోయారని అధిష్టానం గుర్రుగా వుంది. ఈ విధంగా అడుగడుగునా అతని వైఫల్యం స్పష్టంగా కనిపిస్తుంది. రాష్ట్ర అధిష్టానం కూడా రవీంద్ర వ్యవహారశైలి పై అసంతృప్తితో వున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మిగతా జిల్లాల పరిస్థితి ఎలా వున్నా విశాఖ జిల్లా అధ్యక్షుడ్ని మాత్రం తప్పనిసరిగా మారుస్తారనే ప్రచారం జరుగుతోంది. 26 జిల్లాల అధ్యక్షులను, నూతన కమిటీని ప్రకటించాలని బీజేపీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది. బీజేపీ విశాఖ జిల్లా అధ్యక్ష పదవి రేసులో విజయానంద్ రెడ్డి, పరశరామరాజు పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. విశాఖ జిల్లా అధ్యక్షులుగా విజయానంద్ రెడ్డిని ఎంపిక చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలుస్తోంది. బిజేపి నుంచి విశాఖ తొలి మేయర్ దివంగత ఎస్ ఎస్ ఎన్ రెడ్డి కుమారుడే విజయానంద్. జిల్లా అధ్యక్ష పదవి రేసులో పార్టీ సీనియర్ నేత పరశరామరాజు పేరు ప్రముఖంగా వినిపిస్తున్నప్పటికీ రాష్ట్ర స్థాయిలో అయన సేవలు వినియోగించు కోవాలని పార్టీ భావిస్తున్నట్టు సమాచారం. ఒకటి రెండు రోజుల్లో కొత్త అధ్యక్షుడి నియామకం జరుగుతుందని తెలుస్తోంది.

బల్క్ డ్రగ్ వర్చువల్ శంకుస్థాపనకు భారీ ఏర్పాట్లు

లైవ్‌లో వీక్షించిన జేసి జాహ్నవి, ఆర్డీఓ వివి రమణ, ప్రజా ప్రతినిధులు

విశాలాంధ్ర - నక్కపల్లి: మండలంలో రాజయ్యపేట ప్రాంతంలో 1870 కోట్ల రూపాయలతో బల్క్ డ్రగ్ పార్క్ కంపెనీ వర్చువల్ శంకుస్థాపనకు అధికారులు భారీ ఏర్పాటు చేశారు. ఈ మేరకు బుధవారం విశాఖపట్నం ఏయు గ్రౌండ్స్ లో దేశ ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పలు శంకుస్థాపనకు హాజరయ్యారు. సందర్భంగా నక్కపల్లి మండలం రాజయ్యపేట గ్రామంలో 1870 కోట్ల రూపాయలతో ఏర్పాటు చేయబోయే బల్క్ డ్రగ్ పార్కుకు ప్రధానమంత్రి విశాఖ వేదికగా వర్చువల్ గా శంకుస్థాపనకు శ్రీకారం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా అధికారులు రాజయ్యపేట ప్రాంతంలో భారీ ఏర్పాట్లు చేసి ప్రజలు వీక్షించే విధముగా భారీ స్క్రీన్ ను ఏర్పాటు చేశారు. ముందుగా వివిధ పాఠశాల నుంచి విద్యార్థులు డాన్సులతో అందరినీ ఆకట్టుకున్నాయి. దేశ ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగాలను లైవ్ స్క్రీన్ ల ద్వారా జాయింట్ కలెక్టర్ జాహ్నవి ఆర్డీఓ వివి రమణ తాసిల్దార్ నరసింహా మూర్తి తో పాటు అధికారులు ప్రజా ప్రతినిధులు వీక్షించారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఎటువంటి అవాంఛనీయాలు సంఘటనలు జరగకుండా సిఐ కుమారస్వామి పర్యవేక్షణలో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.